దరఖాస్తుల వెల్లువ..

- ఆర్ అండ్ బీ అతిథి గృహాల్లో పోస్టులకు విశేష స్పందన
- 262 దరఖాస్తుల సమర్పణ

నెల్లూరు(బారకాసు): ఆర్ అండ్ బీ శాఖకు చెందిన అతిథి గృహాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వర్తించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. ఇప్పటి వరకు 262 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 27 పోస్టులుండగా, వీటి కోసం అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ నెల 19 నుంచి 22 వరకు 154 దరఖాస్తులు రాగా, శుక్రవారం ఒక్క రోజే 108 అందడం విశేషం. దీంతో ఆర్ అండ్ బీ సర్కిల్ కార్యాలయంలోని సంబంధిత విభాగం కిక్కిరిస్తోంది. దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 26 వరకు అవకాశం ఉండగా, ఆలోపు మరో వందకుపైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఉద్యోగాల భర్తీకి సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో చైర్మన్‌గా కలెక్టర్‌తో పాటు 8 మంది సభ్యులుంటారు. వీరి సమక్షంలో అర్హులను ఎంపిక చేయనున్నారు.


దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులు

వైఎస్సార్‌సీపీలో చేరికలు సంతోషకరం


పార్టీలో చేరిన వారితో అనిల్‌కుమార్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): టీడీపీకి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 52వ డివిజన్‌కు చెందిన టీడీపీ నేతలు ప్రేమ్‌కుమార్, జాఫర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు 200 మంది ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. నగరంలోని రాజన్నభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఇంత మంది పార్టీలో చేరడం శుభపరిణామమని చెప్పారు. పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రెహ్మాన్, యూసఫ్, అల్తాఫ్, షాకీర్, నిస్సార్ తదితరులు పార్టీలో చేరారు. పార్టీ నేతలు ప్రసాద్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మి యాగ మహోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని వీఆర్సీ మైదానంలో అష్టలక్ష్మి యాగ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా కొండకొప్పాక అష్టలక్ష్మి పీఠం స్వామి గోదాచలన మంజీర పీతాంబరం రఘునాథాచార్య ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు యాగ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అగ్నిప్రతిష్ట, పెరుమాళ్ల ఆరాధన, అభిషేకం, లక్ష కుంకుమార్చన, భజన, కీర్తన తదితరాలను నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజను జరిపారు.

నేత్రపర్వంగా ఊంజల్‌సేవ



నెల్లూరు(బృందావనం): మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి ఊంజల్‌సేవను నేత్రపర్వంగా శుక్రవారం నిర్వహించారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణం, సౌందర్య లహరి తదితరాలను వేడుకగా జరిపారు. ఈఓ వెంకటసుబ్బయ్య, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్ పర్యవేక్షించారు.

పెన్‌కాక్ సిలాట్‌లో క్రీడాకారులకు పతకాలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలను సాధించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారులను శుక్రవారం అభినందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్డీఓ యతిరాజ్ మాట్లాడారు. పెన్‌కాక్ సిలాట్ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో టీమ్ పోటీల్లో 15 రజత, వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకాన్ని సాధించడాన్ని అభినందించారు. పెన్‌కాక్ సిలాట్ రాష్ట్ర కార్యదర్శి విజయభరద్వాజ్‌రెడ్డి, జిల్లా ట్రెజరర్ విజయచాముండేశ్వరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్, చాట్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను వీడాలి



మనుబోలు: మూఢ నమ్మకాలను ప్రజలు వీడాలని జనవిజ్ఞాన వేదిక నాయకులు అన్నారు. మండలంలోని మడమనూరులో దెయ్యాలు తిరుగుతున్నాయని గ్రామస్తులు భయపడుతున్న నేపథ్యంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. జేవీవీ సభ్యులు కళా బృందంతో కలిసి గ్రామంలో పర్యటించి గ్రామస్తుల్లో నెలకొన్న అపోహలను తొలగించారు. దెయ్యం అన్నది కేవలం మన మూఢ నమ్మకం మాత్రమేనని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ఉదయభాస్కర్, సభ్యులు శీనానాయక్, కాలేషా, రఫీ పాల్గొన్నారు.

వైభవంగా కామాక్షితాయి కల్యాణం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి దేవస్థానంలో అమ్మవారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. దేవదేవేరులను విశేషంగా అలంకరించి అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

నెల్లూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని రూరల్ ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కాకుపల్లిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రూరల్ మండలంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు వైద్యసేవలను అందించారని వివరించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, సర్పంచ్ కోసూరు సుభాషిణి, కలివెలపాళెం సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, అల్లీపురం పీహెచ్‌సీ వైద్యుడు హజరత్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కోసూరు కేశవులుగౌడ్, రమణయ్య, వేణు, నాగార్జున్‌రెడ్డి, సాల్మన్, వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కాకుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

బీసీలకు రాజకీయ ప్రాధాన్యమివ్వాలి

నెల్లూరు(వేదాయపాళెం): రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించడంతో పాటు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో అవకాశమివ్వాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు కోరారు. ముత్తుకూరు రోడ్డులోని ఓ హోటల్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శంకర్‌రావు మాట్లాడారు. బీసీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక, సబ్‌ప్లాన్‌ను రూపొందించాలని కోరారు. రాజ్యాధికారమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తమకు సీట్లు కేటాయించే పార్టీలకే బీసీలు అండగా ఉంటారన్నారు. బీసీ సంఘాల నేతలు బూధాటి రాధయ్య, సంజీవయ్య, రఘురామ్ ముదిరాజ్, తన్నీరు కోటయ్య, రాము, గోపాల్, ఎస్సెస్ యాదవ్, వెంకటేశ్వర్లు, ఆత్మకూరు శ్రీనివాసులు, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శంకర్‌రావు

లక్ష్మీనృసింహుడి నగరోత్సవం నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వ్యాస పూర్ణిమను పురస్కరించుకొని వేదగిరి లక్ష్మీనరసింహుడి నగరోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నామని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను స్టోన్‌హౌస్‌పేటలోని డీసీఎమ్మెస్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. నవాబుపేటలో డీసీఎమ్మెస్‌కు చెందిన పాత రైస్‌మిల్లు స్థలం వద్ద లక్ష్మీనృసింహుడు కొలువుదీరనున్నారని చెప్పారు. విశేష పూజల అనంతరం నగరోత్సవాన్ని సాయంత్రం నిర్వహించనున్నామని తెలిపారు. భక్తులు విశేషంగా హాజరుకావాలని కోరారు. అనంతరం చలపతిరావును సత్కరించారు. లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ఈఓ గిరికృష్ణ, డీసీఎమ్మెస్ బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి, అర్చకుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న చలపతిరావు తదితరులు

ఓటు హక్కు వినియోగంపై ప్రచారం



నెల్లూరు(బారకాసు): ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలంటూ నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తృత ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ హరినారాయణన్, కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశాల మేరకు నగర నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటరు నమోదు, ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీలను చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం, ఆదిత్యనగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు పలువురు హాజరయ్యారు.

వరిగొండలో వనభోజనాలు రేపు


మాట్లాడుతున్న దశరథరామయ్య

నెల్లూరు(మినీబైపాస్): వరిగొండలోని జ్వాలాముఖి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో జంగమ సంఘీయుల వనభోజనాలను ఆదివారం నిర్వహించనున్నామని సంఘ అధ్యక్షుడు గంధవళ్ల దశరథరామయ్య పేర్కొన్నారు. మూలాపేటలోని జంగమ కల్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. తొలుత అమ్మవారికి విశేష పూజలను నిర్వహించనున్నామని చెప్పారు. భారీగా తరలిరావాలని కోరారు. నిర్వాహకులు పిచ్చయ్య, కృష్ణ, మల్లయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు ఎన్‌ఎస్‌ఎస్ వేదిక



ముత్తుకూరు: సమాజ సేవలో పాలు పంచుకోవాలనుకునే యువతకు ఎన్‌ఎస్‌ఎస్ వేదికగా నిలుస్తోందని మత్స్యకళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపూడిలో మత్స్యకళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. తొలిరోజు విద్యార్థులు గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ జాతీయ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా గ్రామాలకు సేవ చేసే అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ధనపాల్, డాక్టర్ అనుపమ, మెడికల్ ఆఫీసర్ చందన, త్రివేణి, దీప్తి, ఉపసర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు అవకాశాలపై పరిశీలన

నెల్లూరు(బారకాసు): వెంకటాచలంలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, గొలగమూడిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ఏర్పాటు అవకాశాలను కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం పరిశీలించారు. డీఆర్వో లవన్న, అర్బన్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వేయర్ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన

నెల్లూరు(బారకాసు): రూరల్ పరిధిలోని 20వ డివిజన్‌కు ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేసిన మేలును ఎన్నటికీ మరువమని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి రావు శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్నేహానగర్‌లో నూతనంగా నిర్మించనున్న రోడ్డుకు శంకుస్థాపనను స్థానికులతో కలిసి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు సమస్యను ఎంపీకి తెలియజేయగా, వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి మంజూరు చేయించారని చెప్పారు. నేతలు పద్మజాయాదవ్, రమాదేవి, సరళమ్మ, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, రసూల్, అబ్రహాం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



బాలల శ్రేయస్సుకు పనిచేయండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బాలల శ్రేయస్సు, వారి హక్కుల కోసం ప్రభుత్వ శాఖలు ప్రణాళికబద్ధంగా పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి పేర్కొన్నారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆమె హాజరయ్యారు. అనంతరం సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించి.. అక్కడ ఆశ్రయం పొందుతున్న బాలికలతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరు మహిళలకు సంబంధించిన కుటుంబ కలహాలపై కౌన్సెలింగ్ చేసి వారి కుటుంబసభ్యులతో చర్చించారు. సఖిలో నమోదైన కేసుల వివరాలను ఆరాతీసి రికార్డులను పరిశీలించారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మాధవి, డీసీపీఓ సురేష్, ఐసీడీఎస్ సీడీపీఓలు అన్నపూర్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పద్మావతి

రంగడికి బంగారు గరుడసేవ నేడు

నెల్లూరు(బృందావనం): వ్యాసపూర్ణిమను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బంగారు గరుడసేవను శనివారం సాయంత్రం నిర్వహించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు భారీగా తరలిరావాలని కోరారు.

ఘన నివాళి

నెల్లూరు(బారకాసు): సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తల్లి మస్తానమ్మ బుధవారం మరణించారు. ఈ క్రమంలో సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే నివాసానికి మేయర్ స్రవంతి, జయవర్ధన్ దంపతులు శుక్రవారం వెళ్లి మస్తానమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కిలివేటి సంజీవయ్యకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు రూరల్: కొత్తూరు పరిధిలోని వైఎస్సార్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వైద్యులు మేఘనాథ్, దీప్తి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విక్టోరియా మాట్లాడారు. పేదలు నివసించే ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఎస్వీఆర్, జేమ్స్‌గార్డెన్ ఫీడర్లలో మరమ్మతుల కారణంగా జేమ్స్‌గార్డెన్, బాలాజీనగర్ మెయిన్ రోడ్డు, మసీదు సెంటర్, అన్నపూర్ణ అపార్ట్‌మెంట్స్, ఆత్మకూరు బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- నవాబుపేట మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌లో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పుల్లమ్మసత్రం, నవాబుపేట, గాంధీవీధి తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.
- నగరంలోని ఇరుగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ రాజావారివీధి ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా రాజావారివీధి, చాముండివారితోట తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.
- ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నిప్పో ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న తరుణంలో రిత్విక్ లేఅవుట్, గాయత్రినగర్, కరెంటాఫీస్ సెంటర్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని తెలిపారు.

సంగీతంలో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో సంగీతంలో సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించామని ప్రిన్సిపల్ గిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 91823 23406, 89781 54116 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

27న ఉద్యోగుల భవిష్యనిధి సమావేశం

నెల్లూరు(సెంట్రల్): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ, నెల్లూరు ఆధ్వర్యంలో సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నామని అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అమితాబ్ శుక్లా, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వల్లూరు సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామ్మూర్తినగర్‌లోని నేతాజీ పైలట్ స్కూల్లో సమావేశాన్ని నిర్వహించనున్నామని చెప్పారు.

చండీహోమం నేడు

నెల్లూరు(బృందావనం): మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకమఠం ప్రాంగణంలో గల కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో చండీహోమాన్ని శనివారం నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు నందకిశోర్, ఉషాకుమారి దంపతులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసౌర హోమాన్ని ఆదివారం నిర్వహించనున్నామని, కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునే వారు 96528 60264 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.